సాక్షి ఖమ్మం

శుక్రవారం । 20 । జనవరి । 2023



పాలన ప్రారంభం

కొత్త కలెక్టరేట్‌లో కలెక్టర్ గౌతమ్, ఇతర ఉన్నతాధికారులే కాక ఇతర శాఖల ఉద్యోగులు సైతం విధులు ప్రారంభించారు. 8లో



పెరిగిన మిర్చి విక్రయాలు

ఖమ్మం మార్కెట్‌లో ఒక్కసారిగా మిర్చి విక్రయాలు పెరిగాయి. మార్కెట్‌కు 31వేలకు పైగా బస్తాల మిర్చిని రైతులు తీసుకొచ్చారు. 10లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 31° / 18°

శుక్రవారం మధ్యాహ్నం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. సాయంత్రం తర్వాత చలి పెరిగే అవకాశముంది.

న్యూస్‌రీల్

రేపు విద్యుత్ సమస్యలపై ముఖాముఖి

ఖమ్మంవ్యవసాయం: విద్యుత్ వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలపై శనివారం ముఖాముఖి నిర్వహిస్తున్నట్లు ఎస్ఈ ఏ.సురేందర్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి ఆధ్వర్యాన జరిగే ఈ కార్యక్రమం జిల్లా పంచాయతీ మౌలిక వసతుల కేంద్రం(డీపీఆర్‌సీ భవనం)లో జరుగుతుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని విద్యుత్ వినియోగదారులు వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

మున్సిపల్ విధుల్లో అసిస్టెంట్ కలెక్టర్



మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్

సత్తుపల్లిటౌన్: మున్సిపల్ విధులను అధ్యయనం చేసేందుకు అసిస్టెంట్ కలెక్టర్ రాధిక గుప్తా గురువారం సత్తుపలికి వచ్చారు. మధ్యప్రదేశ్‌కు చెందిన 2021 బ్యాచ్ ఐఏఎస్ అధికారి రాధికగుప్తా రెండు వారాల పాటు సత్తుపల్లి మున్సిపల్ విధులు, పరిపాలన అంశాలపై అధ్యయనం చేయనున్నారు. ఈమేరకు మున్సిపల్ పరిపాలన అంశాలు, వివిధ విభాగాల పనితీరుపై కమిషనర్ కె.సుజాత వెల్లడించారు. అలాగే, మెప్మా విభాగం, బాధ్యతలు, స్వయం సహాయక సంఘాల ఏర్పాటు, రుణాల మంజూరుపై మెప్మా పీఆర్పీ గుడిపూడి సుజాతను అడిగి తెలుసుకున్నారు. తొలుత పట్టణంలోని అంబేద్కర్‌నగర్ కంటివెలుగు కేంద్రాన్ని అసిస్టెంట్ కలెక్టర్ పరిశీలించారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ టి.సీతారాం, డాక్టర్ అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలపై మేళా




కమిషనర్ ఆదర్శ్ సురభి

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలో ఇంటి పన్నులు, ఇతర రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక మేళా నిర్వహించనున్నట్లు కమిషనర్ ఆదర్శ్ సురభి తెలిపారు. కేఎంసీలో గురువారం ఆయన రెవెన్యూ అధికారులు, బిల్లు కలెక్టర్లతో పన్నుల వసూలపై సమీక్షించారు. ప్రతీ సోమ, బుధ వారం రెవెన్యూ సమస్యలపై ప్రత్యేకంగా మేళాలు ఏర్పాటుచేయాలని సూచించారు. ఈ మేళాలో పేరు, అసెస్‌మెంట్‌లో తప్పులు, పేరు మార్పిడి, నల్లా కనెక్షన్ ఆన్‌లైన్ చేయడం వంటివి పరిష్కరించాలని తెలిపారు. నగర ప్రజలు తమ సమస్యలపై సోమ, బుధ వారాల్లో రెవెన్యూ ఆఫీసర్ శ్రీనివాసరావు(84669 07055), రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు కె.శ్రీనివాసరావు(79012 98221), పి.లోకేష్(99596 91617)ను సంప్రదించాలని కమిషనర్ ఆదర్శ్ సురభి సూచించారు.



కరీంనగర్‌లో మానేరుపై నిర్మించిన కేబుల్ బ్రిడ్జి

మున్నేరుపై 420మీటర్ల కేబుల్ బ్రిడ్జి నిర్మిస్తారు. ఇందులో 300 మీటర్లు కేబుల్‌పై, 120మీటర్లు ఆర్‌సీసీపై ఉంటుంది. ఇందుకోసం రూ.180 కోట్లు మంజూరు చేయగా.. బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే ప్రజా రవాణా ఇబ్బందులు తీరడమే కాక నగరానికి కొత్త అందం సంతరించుకోనుంది.



ప్రస్తుత మున్నేరు బ్రిడ్జి

మున్నేరుకు కొత్త అందాలు !

పాత బ్రిడ్జి స్థానంలో కేబుల్ బ్రిడ్జి

- రూ.180 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు
- సీఎం ప్రకటించిన మరుసటిరోజే నిధులు
- ఖమ్మం నగరంలో తీరనున్న ట్రాఫిక్ సమస్య

హామీ.. ఆ వెంటనే నిధులు

ఖమ్మంలో బుధవారం బీఆర్ఎస్ సభ సందర్భంగా జిల్లాపై ముఖ్యమంత్రి కేసీఆర్ వరాల జల్లు కురిపించారు. జిల్లాలోని 589 గ్రామపంచాయతీలతోపాటు ఐదు మేజర్ గ్రామపంచాయతీలకు, ఖమ్మం సహా నాలుగు మున్సిపాలిటీలకు కలిపి రూ.248.90 కోట్ల నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల, మున్నేరుపై బ్రిడ్జి నిర్మాణాన్ని చేపడతామని తెలిపారు. అయితే హామీ ఇచ్చిన మరుసటి రోజే మున్నేరుపై బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తూ పరిపాలనా అనుమతులు రావడం విశేషం. హైదరాబాద్‌లోని దుర్గం చెరువు, కరీంనగర్ మానేరు తరహాలో ఈ బ్రిడ్జి నిర్మాణం చేపట్టనుండగా.. ఇది రాష్ట్రంలోనే మూడో కేబుల్ బ్రిడ్జిగా నిలవనుంది.

సాక్షిప్రతినిధి, ఖమ్మం: హైదరాబాద్‌లోని దుర్గం చెరువు, కరీంనగర్‌లోని మానేరుపై నిర్మించిన కేబుల్ బ్రిడ్జి తరహాలో ఖమ్మంలోని మున్నేరుపై బ్రిడ్జి నిర్మాణం కానుంది. ఇది రాష్ట్రంలోనే మూడో బ్రిడ్జి కానుండగా.. ఇందుకోసం రూ.180 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. నగరంలోని నయాబజార్ వద్ద మున్నేరుపై బ్రిటీష్ కాలంలో బ్రిడ్జి నిర్మించారు. రాను రాను నగరం విస్తరించడం, వాహనాల రద్దీ పెరగడంతో అవసరాలకు అనుగుణంగా బ్రిడ్జి సేవలు అందించలేకపోతోంది. ఈ కారణంగా నూతన బ్రిడ్జి నిర్మించాలనే ఉద్దేశంతో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో బీఆర్ఎస్ సభ సందర్భంగా ముఖ్యమంత్రి గ్రీన్‌సిగ్నల్ ఇవ్వగా.. గురువారం నిధులు విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈమేరకు మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్.. కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

బ్రిటీష్ కాలం నుంచి..

ఖమ్మం నగరంలో మున్నేరుపై బ్రిటీష్ కాలంలో వంతెన నిర్మించారు. అప్పటి నుంచి ఖమ్మం నుంచి హైదరాబాద్, వరంగల్, నల్లగొండ, మిర్యాలగూడ తదితర నగరాలకు రాకపోకలకు వారధిగా నిలుస్తోంది. ఈ బ్రిడ్జి ప్రాంతంలోనే బస్టాండ్, విద్య, వైద్య సంస్థలు ఉండటంతో చుట్టుపక్కల ప్రాంతాల నుంచి రాకపోకలతో రద్దీ కనిపిస్తుంది. రానురాను నగరానికి వచ్చే జనాభా పెరగడంతో తరచూ ట్రాఫిక్ జామ్ అవుతోంది. బ్రిడ్జి వెడల్పు తక్కువగా ఉండడంతో ప్రమాదాలు, వర్షాకాలంలో వరద ఉధృతితో మున్నేరు బ్రిడ్జికి ప్రమాదం పొంచి ఉందనే ప్రచారం జరుగుతోంది. కాగా, రాపర్తినగర్ వద్ద మరో బ్రిడ్జి నిర్మించినా అవసరాలు తీరడం లేదని భావించిన మంత్రి పువ్వాడ కొత్త బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదించారు. ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆర్అండ్ బీ అధికారులకు సూచించడ మే కాక, కొత్త బ్రిడ్జి అవసరాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లారు.

సీఎంకు మంత్రి పువ్వాడ కృతజ్ఞతలు

మున్నేరు బ్రిడ్జి నిర్మాణానికి నిధులు విడుదల చేయడంపై రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ సభ సందర్భంగా హామీ ఇచ్చిన సీఎం ఆ వెంటనే నిధులు విడుదల చేయడంతో కేసీఆర్‌ను హైదరా బాద్‌లో కలిసి నగర ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఇక ఎంపీలు నామా నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర కూడా ప్రకటించిన 24గంటల్లో నిధులు మంజూరు చేసిన సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

సమన్వయంతో సక్సెస్

- బీఆర్ఎస్ తొలిసభపై నేతల ఖుషీ
- ఇన్నాళ్ల వైరం వీడి సభ బాట పట్టిన పలువురు..
- వేర్వేరుగానైనా జన సమీకరణ చేసిన ఇంకొందరు
- ఉమ్మడి జిల్లా నేతలను అభినందించిన సీఎం కేసీఆర్

సాక్షిప్రతినిధి, ఖమ్మం: అధికార టీఆర్ఎస్.. బీఆర్ఎస్‌గా రూపాంతరం చెందాక ఖమ్మంలో నిర్వహించిన తొలి సభ ఉమ్మడి జిల్లాలోని పలు నియోజకవర్గాల నేతలను ఒకేదారిలో నడిపించింది. సభకు పదిరోజుల ముందు వరకు పలుచోట్ల నేతల మధ్య ఉన్న వైరం కొంత చల్లబడింది. ఎవరికి వారు బల ప్రదర్శన చాటేలా జన సమీకరణ చేయడంతో సభ సక్సెస్ అయిందని పార్టీ నాయకత్వం భావిస్తోంది. రాష్ట్ర మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపీలు నామా నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, బండి పార్థసారథిరెడ్డి, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ, పార్టీ జిల్లా అధ్యక్షుడు తాత మధుసూదన్, విప్ రేగా కాంతారావు చేసిన ప్రయత్నాలతో సభకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కేడర్ కదిలింది.

వద్దిరాజు ఇంట్లో మకాం

ఖమ్మం కేంద్రంగా బీఆర్ఎస్ తొలి సభకు సీఎం కేసీఆర్ మూహూర్తం నిర్ణయించడమే కాక కీలక బాధ్యతలను మంత్రులు హరీశ్‌రావు, పువ్వాడకు అప్పగించారు. దీంతో పార్టీలో ట్రబుల్ షూటర్‌గా పేరొందిన హరీశ్‌రావు జిల్లాలో వారం పాటు మకాం వేశారు. ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ఇంట్లో ఉంటూ నియోజకవర్గాల వారీగా సమీక్షించిన ఆయన ఎక్కడెక్కడ నేతల మధ్య పొసగడం లేదో వారిని కూర్చోబెట్టి మాట్లాడారు. సభ సక్సెస్ చేసేలా ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులతో వద్దిరాజు ఇల్లే వేదికగా చర్చలు చేశారు. అంతేకాకుండా సభకు ముందే రోజే మిగతా జిల్లాల మంత్రులు, ప్రజాప్రతినిధులు ఖమ్మం చేరుకోవాలన్న సీఎం కేసీఆర్ ఆదేశాలతో చాలామంది రాగా, వద్దిరాజు ఇంట్లోనే ఉండి జనసమీకరణపై దృష్టి సారించారు.

వైరాలో ఆ ముగ్గురు

వైరా నియోజకవర్గంలో ఎమ్మెల్యే రాములునాయక్, మాజీ ఎమ్మెల్యేలు బానోతు మదన్‌లాల్, చంద్రావతి ఎవరికి వారు వర్గాలుగా కొనసాగుతున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యేగా తనకే టికెట్ వస్తుందని రాములునాయక్, బలంగా ఉన్న తమకే టికెట్ వస్తుందని మిగతా ఇద్దరు ఆశిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ఆవిర్భావ సభ వీరిని ఒకే వేదికపై చేర్చింది. వైరాలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ముగ్గురు పాల్గొని తమ వర్గీయులను సభకు తరలించడం ద్వారా బలప్రదర్శన కొనసాగించారు.

మీతో భోజనం చేస్తా...



మంత్రి అజయ్‌కుమార్, ఎంపీ వద్దిరాజును అభినందిస్తున్న సీఎం కేసీఆర్

జిల్లాలో సభ సక్సెస్ కావడంపై ముఖ్యమంత్రి కేసీఆర్ జిల్లా నేతలను అభినందించారు. మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌తో పాటు, ఎంపీలు నామా నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, బండి పార్థసారథిరెడ్డి, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ తాతా మధు, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలందరినీ ప్రశంసించారు. 'త్వరలో మీ అందరూ ప్రగతిభవన్‌కు రావాలి, మీతో భోజనం చేస్తా' అంటూ సీఎం పలువురికి ఫోన్‌లో చెప్పినట్లు తెలిసింది. అలాగే మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపీ వద్దిరాజు గురువారం సీఎం కేసీఆర్‌ను కలవగా.. అద్భుతంగా సభ నిర్వహించారని అభినందించడమే కాక వచ్చే ఎన్నికల్లోనూ టీం వర్క్‌గా చేయాలని సూచించారు.

పాలేరు నుంచి కందాల, తుమ్మల

సభ సందర్భంగా పార్టీ అధిష్టానం మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ప్రాధాన్యతనిచ్చింది. మంత్రి హరీశ్‌రావు నేరుగా తుమ్మల ఇంటికి వెళ్లడం.. ఆతర్వాత కొత్తగూడెంలో సీఎం కార్యక్రమానికి తుమ్మల హాజరు కావడం వంటి పరిణామాలు చోటు చేసుకున్నాయి. పార్టీ ఇచ్చిన సూచనలతో తుమ్మల సన్నాహక సమావేశాలకు హాజరవడంతో పాలేరు నియోజకవర్గం నుంచి ఆయన అనుచరవర్గం, కేడర్ సభకు తరలివచ్చింది. మరోపక్క ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి సైతం ప్రతిష్టాత్మకంగా తీసుకొని కేడర్‌ను తరలించారు. మంత్రి ప్రశాంత్ రెడ్డి ఇటీవల పర్యటన సందర్భంగా 'ఉపేందర్‌రెడ్డి గెలుపునెవరూ ఆపలేరు' అని వ్యాఖ్యానించడాన్ని కందాల వర్గం విస్తృతంగా ప్రచారం చేసుకుంది.

'గూడెం'లో జలగం చర్చ

గత ఎన్నిల్లో కొత్తగూడెం టీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిన జలగం వెంకట్రావు కొంత కాలం నుంచి స్తబ్దుగా ఉన్నారు. అయితే, ఖమ్మం సభకు హాజరు కావాలని పార్టీ అధిష్టానం నుంచి ఆయనకు ఆహ్వానం అందడం విశేషం. బీఆర్ఎస్ సభావేదికపైకి ఆయన కూడా వచ్చారు. ఈ పరిణామాలతో ఇంత కాలం గుంబనంగా ఉన్న జలగం రీ ఎంట్రీతో కొత్తగూడెంలో రాజకీయంగా చర్చ జరుగుతోంది.

విశేషం.. విశ్వరూపం

రామనామస్మరణతో మార్మోగిన భద్రగిరి

భద్రాచలం: భద్రాచలంలో శ్రీ సీతారామచంద్రస్వామి వారికి గురువారం విశేషంగా విశ్వరూప సేవ నిర్వహించగా వేలాదిగా భక్తులు తిలకించి పులకించిపోయారు. ముక్కోటి ఏకాదశి ప్రయుక్త అధ్యయనోత్సవాలు ముగిసిన అనంతరం వచ్చే బహుళ ద్వాదశి రోజున ఈ వేడుకను ఎక్కడా లేని విధంగా భద్రాద్రి రామాలయంలోనే నిర్వహిస్తారు. సంవత్సర కాలంలో చేసే పూజల్లో ఏమైనా దోషాలు దొర్లితే ప్రాయశ్చిత్తం కోసం శ్రీ సీతారామలక్ష్మణ స్వామి, ఉపాలయాల్లో ఉండే ఉత్సవ మూర్తులను ఒకే చోటకు చేర్చి ఏకకాలంలో సేవలు నిర్వహించడం ఈ విశ్వరూప సేవ విశిష్టత. ఈమేరకు స్వామి వారి ఉత్సవ మూర్తులను గర్భగుడి నుంచి బేడా మండపానికి తీసుకొచ్చి కొలువుదీర్చారు. ప్రత్యేక పూజల తర్వాత స్వామికి ప్రత్యేక కదంబ ప్రసాదాన్ని నైవేద్యంగా సమర్పించారు.



స్వామివారికి నక్షత్ర హారతి సమర్పిస్తున్న అర్చకులు

రామచంద్ర రఘువీర..

సుందరంగా అలంకరించిన బేడా మందిరంలో విశ్వరూప సేవ సాగింది. అర్చకులు, వేద పండితులు 'రామచంద్ర.. రఘువీర..' 'రామచంద్ర.. రణ దీర' అంటూ కీర్తనలను ఆలపిస్తుండగా, భక్తులు శ్రీరామయనమః అంటూ శృతి కలిపారు. ఈఓ బి.శివాజీ దంపతులు, ప్రధాన అర్చకులు పొడిచేటి సీతారామానుజం, విజయరాఘవన్, స్థానాచార్యులు కేఈ స్థలశాయి, ఉద్యోగులు పాల్గొన్నారు.

తొలి ఫిర్యాదు.. పరిష్కారం!

ఖమ్మం సహకారనగర్: నూతన కలెక్టరేట్‌కు వచ్చిన తొలి సమస్యను కలెక్టర్ గౌతమ్ పరిష్కరించారు. కలెక్టరేట్‌ను బుధవారం ప్రారంభించగా, గురువారం చింతకాని మండలం వందనంకు చెందిన నారపోగు వెంకటేశ్వర్లు వచ్చాడు. దళితబంధు పథకం కింద గాలి యంత్రం మంజూరైనా ఇవ్వలేదని కలెక్టర్‌కు విన్నవించారు. దీంతో స్పందించిన కలెక్టర్ తక్షణమే లబ్ధిదారుడికి యంత్రం సమకూర్చాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.



కలెక్టరేట్‌కు వచ్చిన వెంకటేశ్వర్లు

'కంటి వెలుగు'లు మొదలు

- తొలిరోజు 56 శిబిరాల్లో 5,615 మందికి పరీక్షలు
- పలుచోట్ల తనిఖీ చేసిన కలెక్టర్ గౌతమ్
- పరీక్ష చేయించుకున్న కలెక్టర్, ఎమ్మెల్యేలు

ఖమ్మం సహకారనగర్/ఖమ్మం వైద్యవిభాగం: కంటి సమస్యలతో బాధపడే వారికి పరీక్షలు చేసి అవసరమైన అద్దాలు ఇచ్చేందుకు చేపట్టిన కంటి వెలుగు రెండో దశ కార్యక్రమం గురువారం జిల్లా వ్యాప్తంగా మొదలైంది. కంటి వెలుగు కార్యక్రమాన్ని బుధవారం నాలుగు రాష్ట్రాల సీఎంలు లాంఛనంగా ప్రారంభించగా, గురువారం 56శిబిరాలు మొదలయ్యాయి. ఈ శిబిరాల్లో 5,615 మందికి కంటి పరీక్ష నిర్వహించారు. వీరిలో 1,721 మందికి రీడింగ్ గ్లాసులు అవసరం ఉండగా 1,691 మందికి అందజేశారు. అలాగే ప్రిస్కిప్షన్ గ్లాసులు అవసరమున్న 1,381 మందిని గుర్తించారు. వీరికి త్వరలోనే ఆశా, ఏఎన్ఎంల ద్వారా అద్దాలు పంపిణీ చేయనున్నారు.

ప్రత్యేక దృష్టి సారించాలి

కంటి వెలుగు నిర్వహణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ఆదేశించారు. కొత్త కలెక్టరేట్‌లో గురువారం అధికారులతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ ప్రత్యేక అధికారులు కార్యాచరణతో ముందుకు సాగాలని, ప్రజల సమీకరణ విషయంలో మెప్మా, స్వయం సహాయక బృందాలకు సూచనలు చేయాలని తెలిపారు. కాగా, సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయం ప్రారంభోత్సవం విజయవంతం కావడంపై బాధ్యతలు నిర్వర్తించిన అధికారులను కలెక్టర్ అభినందించారు. ఈసమావేశంలో అదనపు కలెక్టర్లు స్నేహలత, ఎన్.మధుసూదన్, డీఆర్వో ఎన్.శిరీష తదితరులు పాల్గొన్నారు.



కంటి పరీక్ష చేయించుకుంటున్న కలెక్టర్ గౌతమ్, పక్కన కేఎంసీ కమిషనర్ ఆదర్శ్, డీఎంహెచ్ఓ మాలతి

అంధత్వ నిర్మూలనే లక్ష్యం

ఖమ్మం మయూరిసెంటర్/రఘునాథపాలెం: సంపూర్ణ అంధత్వ నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమాన్ని చేపట్టిందని కలెక్టర్ వీ.పీ. గౌతమ్ తెలిపారు. ఖమ్మం 43వ డివిజన్ పరిధిలో రేవతిసెంటర్‌లోని కమ్యూనిటీ హాల్, 37వ డివిజన్ పాత మునిసిపల్ కార్యాలయాల్లోని శిబిరాలను కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వివరాలు నమోదు, పరీక్షలపై సిబ్బందికి సూచనలు చేశారు. ప్రజలందరూ శిబిరాలకు వచ్చేలా అవగాహన కల్పించాలని తెలిపారు. అలాగే, 43వ డివిజన్‌లోని కమ్యూనిటీ హాల్‌లోని శిబిరాన్ని పరిశీలించి ఏర్పాట్లు బాగుండడంపై కార్పొరేటర్ బి.జి.క్లైమెంట్‌ను అభినందించారు. ఇక రఘునాథపాలెం మండలం వీ.వీ.పాలెంలో కంటి వెలుగు శిబిరాన్ని కూడా కలెక్టర్ తనిఖీ చేశారు. మేయర్ పునుకొల్లు నీరజ, డీఎంహెచ్ఓ డాక్టర్ మాలతి, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహారా, వైద్యాధికారులు డాక్టర్ నాగమణి, డాక్టర్ ప్రేమలత, డాక్టర్ వెంకటనరసయ్య, డాక్టర్ సంధ్యారాణి, డాక్టర్ ఉషారాణి, డాక్టర్ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ రామకృష్ణ, సర్పంచ్ రావెళ్ల మాధవి పాల్గొన్నారు.

కలెక్టర్, కమిషనర్‌కు + 1.8

ఖమ్మం 43వ డివిజన్ కంటి వెలుగు శిబిరంలో కలెక్టర్ గౌతమ్ పరీక్ష చేయించుకున్నారు. ఆయనకు +1.8 సైట్ ఉన్నట్లు చెప్పగా, ఇప్పటికే అద్దాలు వాడుతున్న ఆయన నిజమేనని చెప్పారు. ఇక కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభికి కూడా అదే స్థాయిలో సైట్ ఉన్నట్లు తేలింది. అలాగే, తల్లాడ మండలం పినపాకలో సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య కంటి పరీక్ష చేయించుకోగా ఎలాంటి ఇబ్బంది లేదని సిబ్బంది వెల్లడించారు. కాగా, కారేపల్లి మండలం అప్పాయిగూడెంలో వైరా ఎమ్మెల్యే రాములునాయక్ పరీక్ష చేయించుకోగా దగ్గరి చూపు సమస్య ఉందని తేలింది. దీంతో ఆయనకు సిబ్బంది +2.5 రీడింగ్ గ్లాసులు అందజేశారు.



పినపాకలో కంటిపరీక్ష చేయించుకున్న సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య



అప్పాయిగూడెంలో పరీక్ష చేయించుకుంటున్న వైరా ఎమ్మెల్యే రాములునాయక్

కిటకిటలాడిన బస్టాండ్

- తిరుగుప్రయాణంలో రద్దీ
- పలు రూట్లలో అదనపు సర్వీసులు

ఖమ్మం మామిళ్లగూడెం: సంక్రాంతి సెలవులకు స్వస్థలాలకు వచ్చిన వారంతా మళ్లీ బయలుదేరడంతో గురువారం ఖమ్మం కొత్త బస్టాండ్‌లో రద్దీ నెలకొంది. సెలవులు మంగళవారమే ముగిసినా, బుధవారం బీఆర్ఎస్ సభ కారణంగా బస్సులు లేకపోవడంతో చాలామంది ప్రయాణాలు రద్దు చేసుకున్నారు. ఇక గురువారం అంతా ఒకేసారి తిరుగుముఖం పట్టడంతో హైదరాబాద్ తదితర ప్రాంతాలకు వెళ్లే బస్సులు కిటకిటలాడాయి. ఖమ్మం రీజియన్‌లో 160బస్సులు తిప్పుతుండగా రద్దీకి అనుగుణంగా మరో 16 సర్వీసులు పెంచారు. గురువారం రాత్రి 11గంటల నుండి మరో 12 బస్సులు ఏర్పాటుచేస్తామని అధికారులు వెల్లడించారు. ఇందులో ఖమ్మం డిపోకు చెందిన నాలుగు, భద్రాచలం, సత్తుపల్లి డిపోల నుంచి మూడేసి బస్సులతో పాటు మణుగూరు డిపో నుండి రెండు బస్సులు మొదలవుతాయని తెలిపారు.

ఆర్డీనరీ సర్వీసులు కూడా..

ఖమ్మం డిపో నుండి కోదాడకు రోజువారీ 96ట్రిప్పులు నడుతుపుతుండగా, రద్దీ కారణంగా గురువారం మరో నాలుగు ట్రిప్పులు పెంచారు. ఇక బోనకల్లుకు 28ట్రిప్పులకు తోడు రెండు ట్రిప్పులు, ఇల్లెందుకు 116 ట్రిప్పలకు అదనంగా ఎనిమిది ట్రిప్పులు నడిపించారు. అయితే, హైదరాబాద్‌కు అదనపు సర్వీసులు నడుస్తుండడంతో సూర్యాపేట వరకు రోజుమాదిరిగానే 45ట్రిప్పులు నడిపినట్లు అధికారులు తెలిపారు. కాగా, ప్రయాణికుల రద్దీ నేపథ్యాన ఖమ్మం కొత్త బస్టాండ్‌లో ఆర్ఎం ప్రభులత పర్యవేక్షించారు. డీఎం, అధికారులతో సమీక్షిస్తూ రద్దీకి అనుగుణంగా సర్వీసులు ఏర్పాటుచేయాలని సూచించారు. ఖమ్మం డీవీఎం భవానీప్రసాద్, డీఎం శ్రీనివాసరావు, సీఐ రామయ్య తదితరులు పాల్గొన్నారు.



కొత్త బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ



బస్టాండ్‌లో పర్యవేక్షిస్తున్న ఆర్ఎం ప్రభులత

క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన టీఎన్జీవోస్ బాధ్యులు


కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న టీఎన్జీవోస్ నాయకులు

ఖమ్మం సహకారనగర్: సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం(నూతన కలెక్టరేట్)ను ప్రారంభించుకున్న నేపథ్యాన టీఎన్జీవోస్ నాయకులు కలెక్టర్ వీ.పీ.గౌతమ్‌ను గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. కొత్త కలెక్టరేట్‌లో కలెక్టర్‌కు టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు షేక్ అఫ్జల్‌హసన్, ఆర్‌వీఎస్.సాగర్ పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నందగిరి శ్రీను, చుంచు వీరనారాయణ, ఆర్‌ఎస్.ప్రసాద్, మజీద్, నాగుల్ మీరా, భాస్కర్, శాబాసు జ్యోతి, స్వప్న, శాంతకుమారి, రుక్మారావు, ఫిరంగి శ్రీను, మురళి తదితరులు పాల్గొన్నారు.

బెంగళూరు ప్రమాదంలో ఎమ్మెల్సీ బంధువు మృతి


నిఖిల్ (ఫైల్)

తిరుమలాయపాలెం: బెంగళూరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ సోదరుడు విశ్వేశ్వరరావు కుమారుడు తాతా నిఖిల్(27) మృతి చెందాడు. పిండిప్రోలుకు చెందిన విశ్వేశ్వరరావు కుమారుడు నిఖిల్ బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. గురువారం ఉదయం ఆయన బైక్‌పై విధులకు వెళ్తుండగా లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. నిఖిల్ మృతదేహాన్ని శుక్రవారం పిండిప్రోలుకు తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

చెట్టు పడడంతో వ్యక్తి..


ఖమ్మంరూరల్: మండలంలోని మద్దులపల్లిలో చెట్టు మీద పడడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. తెల్దారుపల్లికి చెందిన భూక్యా శంకర్(38) గ్రామంలోని రైతు వద్ద చెట్టు కోయడానికి కాంట్రాక్ట్ కుదుర్చుకొని రంపంతో పని చేస్తున్నాడు. ఈక్రమంలో చెట్టు మొత్తం కోయడంతో ఓపక్కకు ఒరుగుతుండగా అది తనపై పడుతుందేమోనని పరుగులు తీశాడు. అయితే, ఆచెట్టు శంకర్‌పైనే పడడంతో తలకు తీవ్ర గాయాలై మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో దుకాణం దగ్ధం


మంటలు ఆర్పుతున్న స్థానికులు

వైరా: స్థానిక గాంధీ చౌక్‌లోని ఓ దుకాణంలో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు అంటుకుని దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గాంధీచౌక్‌లోని శ్యామల దుకాణంలో గురువారం బ్యాగులు, ఇతర సామగ్రికి మంటలు అంటుకుని మంటలు చెలరేగాయి. స్థానికులు ఇచ్చిన సమాచారంతో అగ్నిమాపక సిబ్బందికి చేరుకుని మంటలను అదుపు చేయగా, అప్పటికే రూ.లక్ష విలువైన బ్యాగులు పూర్తిగా దగ్ధమయ్యాయని బాధితురాలు కుమారి తెలిపింది.

108 డ్రైవర్లూ ప్రథమ చికిత్సకు అర్హులే..


సర్టిఫికెట్ అందుకుంటున్న రామకృష్ణ

నేలకొండపల్లి: ప్రమాదాలు, ఇతర ఘటనల్లో ప్రాణాపాయ స్థితికి చేరిన వారిని ఆస్పత్రులకు తీసుకెళ్లడంలో 108 డ్రైవర్లు(పైలట్), చికిత్సలో సిబ్బంది కీలకంగా వ్యవహరిస్తారు. అయితే, ఇన్నాళ్లు వాహనం నడిపేందుకు అర్హత ఉన్న డ్రైవర్లు ఇక నుంచి ప్రథమ చికిత్స కూడా చేయనున్నారు. కొత్తగూడెం జిల్లా కేంద్రంలో రెండు రోజులు గా ఎంపిక చేసిన 108 డ్రైవర్లకు ప్రథమ చికిత్స విషయంలో శిక్షణ ఇచ్చారు. అనంతరం గురువారం పరీక్ష నిర్వహించగా నేలకొండపల్లికి చెందిన 108 డ్రైవర్లు రామకృష్ణ, అజీమ్ అర్హత సాధించి జీవీకే సంస్థ ప్రతినిధుల నుంచి సర్టిఫికెట్లు అందుకున్నారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	7,400	7,400
మిర్చి కొత్తవి	19,700	13,500
నిల్వమిర్చి	19,000	17,000
మిర్చి తాలు	10,000	7,500
పత్తి	8,150	5,600

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.13,881

పాలన ప్రారంభం..


అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ వీ.పీ.గౌతమ్

- కొత్త కలెక్టరేట్‌లో కార్యకలాపాలు మొదలు
- దాదాపుగా వచ్చేసిన అన్నిశాఖలు
- ఇక్కడి నుంచే విధులు నిర్వర్తించిన కలెక్టర్, అదనపు కలెక్టర్లు
- సందర్శకులతో ఐడీఓసీలో సందడి

ఖమ్మం సహకారనగర్: సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం(ఐడీఓసీ) – నూతన కలెక్టరేట్‌లో సేవలు ప్రారంభమయ్యాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావుతో పాటు మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఐడీఓసీని బుధవారం ప్రారంభించిన విషయం విదితమే. అంతకుముందే అన్ని శాఖల ఉద్యోగులను సామగ్రితో రావాలని చేసిన సూచనలతో దాదాపు అన్ని శాఖల ఉద్యోగులు చేరుకున్నారు. దీంతో గురువారం పలు శాఖల కార్యకలాపాలు మొదలుకాగా.. మరికొందరు సామగ్రి సర్దుకోవడంలో నిమగ్నమయ్యారు.

కలియదిరిగిన కలెక్టర్ ..

నూతన కలెక్టరేట్‌కు ఉదయమే చేరుకున్న కలెక్టర్ గౌతమ్ తొలుత తన చాంబర్‌కు వెళ్లారు. అనంతరం ఐడీఓసీలో వివిధ శాఖలకు సంబంధించిన చాంబర్లలో పరిశీలించారు. ఇంకా కొన్ని శాఖల అధికారులు, సిబ్బంది రాకపోవటంతో వెంటనే సామగ్రితో చేరుకోవాలని ఆదేశించారు. అందరూ ఇక్కడి నుంచే విధులు నిర్వర్తించాలని, సమయపాలన పాటించాలని సూచించారు. అలాగే, అదనపు కలెక్టర్లు స్నేహలత, ఎన్.మధుసూదన్ కూడా తమ కార్యకలాపాలను ప్రారంభించారు. ఉదయం కార్యాలయానికి వచ్చిన వివిధ శాఖల అధికారులకు సూచనలు చేయటంతో పాటు పలు ఫైళ్లను పరిశీలించారు. ఇదిలా ఉండగా కలెక్టరేట్‌లో రఘునాథపాలెం ఎస్‌ఐ మాచినేని రవి ఆధ్వర్యాన సిబ్బంది బందోబస్తు విధులు నిర్వర్తిస్తున్నారు.

సందర్శకుల తాకిడి ..

కొత్త కలెక్టరేట్ ప్రధాన రహదారి వెంటే ఉండడం, బుధవారం వరకు పోలీసు బందోబస్తు కొనసాగడంతో సాధారణ ప్రజలకు ప్రవేశం దక్కలేదు. ఇక గురువారం పెద్దగా ఆంక్షలేమీ లేకపోవడంతో రహదారి మీదుగా వెళ్తున్న వాహనదారులే కాక వీ.వీ.పాలెం వాసులు పలువురు కలెక్టరేట్ సందర్శనకు వచ్చారు. పిల్లాపాపలతో కలిసి వచ్చిన వారు గార్డెన్, శిలాఫలకాలు, ఫౌంటెన్ల వద్ద ఫొటోలు, సెల్ఫీలు దిగి సంబరపడిపోయారు.


కలెక్టరేట్ శిలాఫలకం వద్ద ఫొటోలు దిగుతున్న స్థానికులు


నూతన కలెక్టరేట్‌కు పిల్లలతో వస్తున్న మహిళ


ఉద్యోగులకు సూచనలు చేస్తున్న అదనపు కలెక్టర్


రెవెన్యూ విభాగంలో పరిశీలిస్తున్న ఏఓ మదన్‌గోపాల్


కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో అదనపు కలెక్టర్ స్నేహలత


కలెక్టరేట్ ఆవరణలో విధుల్లో పోలీస్ సిబ్బంది


సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ విభాగంలో..


కలెక్టరేట్ పోస్టాఫీస్‌లో సిబ్బంది విధులిలా..

కేర్ సెంటర్ కాదు.. కలెక్టరేట్‌లో క్రెచ్!



కలెక్టరేట్‌లోని ఏర్పాటు చేసిన క్రెచ్ కేంద్రం

నూతన కలెక్టరేట్‌లో దాదాపు 39శాఖల ఉద్యోగులు, సిబ్బంది విధులు నిర్వర్తించనున్నారు. ఈ నేపథ్యాన మహిళా ఉద్యోగులు, సిబ్బంది వారి పిల్లల సంరక్షణ విషయంలో ఇబ్బంది పడకుండా కలెక్టరేట్‌లోనే ప్రత్యేకంగా క్రెచ్ (చిన్నారుల సంరక్షణ కేంద్రం) ఏర్పాటు చేశారు. ఇందులో చిన్నారులకు ఆటవస్తువులతో పాటు నిద్రించేందుకు చిన్నపాటి బెడ్లు, ఊయలలు సిద్ధం చేశారు. అలాగే, తల్లులు తమ చిన్నారులకు పాలు పట్టేందుకు ప్రత్యేక సౌకర్యం కల్పించారు. కార్పొరేట్ స్థాయిలోని బేబీ కేర్ సెంటర్‌గా భావించేలా సౌకర్యాలు కల్పించడంతో పాటు చిన్నారుల సంరక్షణకు ఒక ఆయా, అంగన్‌వాడీ టీచర్‌ను సైతం కేటాయించడం విశేషం. దీంతో ఇళ్లలో పెద్దలెవరూ లేని మహిళా ఉద్యోగులు తమ పిల్లల విషయంలో ఆందోళన చెందకుండా ఈ క్రెచ్‌లో వదిలి విధులు నిర్వర్తించవచ్చని చెబుతున్నారు. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్



కేంద్రంలో ఊయలలు, బెడ్లు, చిన్నారుల ఆట వస్తువులు

బీఆర్‌ఎస్ సభ.. లౌకికశక్తులకు బలాన్ని ఇచ్చింది


మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు మధు, పక్కన మేయర్ నీరజ, డీసీసీబీ చైర్మన్ నాగభూషణం

- విజయవంతం చేసిన అందరికీ కృతజ్ఞతలు
- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మధుసూదన్

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మంలో జరిగిన బీఆర్‌ఎస్ బహిరంగ సభ లౌకిక శక్తులకు బలాన్ని ఇచ్చిందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాత మధుసూదన్ అన్నారు. ఖమ్మంలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సభ విజయవంతానికి కృషి చేసిన ప్రతిఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. అందరినీ ముందుకు నడిపించిన రాష్ట్ర మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, పువ్వాడ అజయ్‌కుమార్, రైతు సమన్వయ సమితి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎంపీలు నామ నాగేశ్వరరావు, పార్థసారథిరెడ్డి, వద్దిరాజు రవిచంద్రతో పాటు సభ సాఫీగా జరిగేలా బందోబస్తు ఏర్పాటుచేసిన పోలీసులు, సభా ప్రాంగణంలో వలంటీర్లుగా సేవలందించిన వారికి పార్టీ తరపున ధన్యవాదాలు చెప్పారు. సభ విజయవంతం కావడంతో ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులకు సీఎం కేసీఆర్ ఫోన్ చేసి అభినందించారని తెలిపారు.

కాగా, ఖమ్మంలో జరిగిన బీఆర్‌ఎస్ తొలి బహిరంగ సభ చరిత్రలో నిలిచిపోతుందని, అంచనాకు మించి అభిమానులు తరలివచ్చారని మధు వెల్లడించారు. సభ ముగిశాక వెళ్తుండగా జరిగిన ప్రమాదంలో మృతి చెందిన ముదిగొండ మండలానికి చెందిన కార్యకర్త ఉపేందర్ కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో నగర మేయర్ పునుకొల్లు నీరజ, డీసీసీబీ, సుడా, మార్కెట్ చైర్మన్లు కూరాకుల నాగభూషణం, బచ్చు విజయ్‌కుమార్, లక్ష్మీప్రసన్న, నాయకులు, కార్పొరేటర్లు చింతనిప్పు కృష్ణచైతన్య, పగడాల నాగరాజు, బెల్లం వేణు, ఆర్‌జేసీ.కృష్ణ, కమర్తపు మురళి, ఉప్పల వెంకటరమణ, శేషు, ఖమర్, రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

దేశ రాజకీయాలకు దిక్సూచిగా బీఆర్‌ఎస్

సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటవీరయ్య, పక్కన నాయకులు

సత్తుపల్లి: బీఆర్‌ఎస్ తొలి సభ విజయవంతమైన నేపథ్యాన దేశ రాజకీయాలకు సీఎం కేసీఆర్ దిక్సూచిగా, ప్రజలకు బీఆర్‌ఎస్ ప్రత్యామ్నాయ అజెండాగా నిలిచిందని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య తెలిపారు. సత్తుపల్లిలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిని దేశమంతా చూస్తుండగా, అత్యంత బలమైన నాయకుడిగా కేసీఆర్ అవతరించారని చెప్పారు. దేశమంతా అర్హులకు దళితబంధు, రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్, రైతుబంధు, రైతు బీమా పథకాలను వర్తింపచేసేందుకే కేసీఆర్ జాతీయ రాజకీయాల్లోకి అడుగు పెట్టారని తెలిపారు. ఇప్పటికే సరిహద్దు రాష్ట్రాలైన మహారాష్ట్ర, కర్ణాటకల్లో తెలంగాణ పథకాల కోసం డిమాండ్ వస్తోందని చెప్పారు.

అందరికీ ధన్యవాదాలు..

బీఆర్‌ఎస్ సభ విజయవంతం కావడంతో సీఎం కేసీఆర్ తనకు ఫోన్ చేసి సత్తుపల్లి నియోజకవర్గం నుంచి బహిరంగ సభకు బాగా తరలివచ్చారని అభినందించడమే కాక అందరికీ ధన్యవాదాలు చెప్పారని ఎమ్మెల్యే వెంకటవీరయ్య వెల్లడించారు. ఇక సత్తుపల్లి మున్సిపాలిటీకి గతంలో మంత్రి కేటీఆర్ ఇచ్చిన రూ.30 కోట్లే కాకుండా.. సీఎం కేసీఆర్ సీడీఎఫ్ నిధుల నుంచి రూ.30 కోట్లు, ఒక్కో పంచాయతీకి రూ.10 లక్షలు, కల్లూరు, తల్లాడ మేయర్ పంచాయతీలకు రూ.10 కోట్లు చొప్పున ప్రకటించడంపై ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.కే.రఫీ, మల్లూరు అంకమరాజు, కౌన్సిలర్లు వీరపనేని రాధికబాబీ, అద్దంకి అనిల్, ఎస్.కే. చాంద్‌పాషా, మందపాటి రవీందర్‌రెడ్డి, చల్లగుండ్ల కృష్ణయ్య, గుండ్ర రాఘవేందర్, ఎం.డీ.గఫార్‌ఖాన్ పాల్గొన్నారు.

నేడు ఉమ్మడి జిల్లాలో పొంగులేటి పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్: మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి శుక్రవారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారు. పాలేరు, ఖమ్మం, కొత్తగూడెం నియోజకవర్గాల్లోని పలు మండలాల్లో పర్యటించనున్న ఆయన శుభకార్యాలకు హాజరవడమే కాక, పలు బాధిత కుటుంబాలను పరామర్శిస్తారని క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

మంత్రి కావాలనే ఆశ నాకూ ఉంది..

వైరా ఎమ్మెల్యే రాములునాయక్

కారేపల్లి: 'నాకు కూడా మంత్రి కావాలనే ఆశ ఉంది. కానీ మీ అందరి ఆశీర్వాదం కావాలి. సీఎం కేసీఆర్ భారత ప్రధానిగా చూడాలని, రెండోసారి ఎమ్మెల్యేగా గెలిచి మంత్రిని కావాలనే ఆశలు ఉన్నాయి.. ఇవన్నీ నెరవేరాలంటే ప్రజల ఆశీర్వాదాలు అవసరం'అని వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ అన్నారు. కారేపల్లి మండలం అప్పాయిగూడెం రైతు వేదికలో కంటి వెలుగు శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం సర్పంచ్ అజ్మీరా అరుణ అధ్యక్షతన ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఆధ్వర్యాన ఖమ్మంలో నిర్వహించిన బీఆర్‌ఎస్ బహిరంగ సభ ప్రధాని మోదీకి కనువిప్పు కలిగేలా విజయవంతమైందని తెలిపారు. దేశ రాజకీయాల్లో బీఆర్‌ఎస్ జెట్ స్పీడ్‌తో పరుగెడుతుందనే ఆశాభావం ఉందని చెప్పారు. ఈ సమావేశంలో ఎంపీపీ మాలోతు శకుంతల, వైస్ ఎంపీపీ రావూరి శ్రీనివాసరావు, ఎంపీడీఓ చంద్రశేఖర్, మండల స్పెషలాఫీసర్ అజయ్‌కుమార్, వైద్యాధికారి సురేష్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పెద్దబోయిన ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

కారేపల్లి : కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని శాంతినగరంలో గురువారం చోటు చేసుకుంది. శాంతినగర్‌కు చెందిన కొందూరి రామచంద్రయ్య(58) కొన్నిరోజులుగా ఇంట్లో కుటుంబసభ్యులతో కలహాలు జరుగుతున్నాయి. దీంతో మనస్తాపానికి గురై ఊరి చివర మామిడితోటలో ఉరి వేసుకున్నాడు. కాసేపయ్యాక స్థానికులు గుర్తించి కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. ఆయనకు భార్య, ముగ్గురు పిల్లలు ఉండగా వారి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై పి.రామారావు తెలిపారు.

ఎమ్మెల్యేను దూషించిన యువకుడిపై కేసు

ఖమ్మంరూరల్: పాలేరు ఎమ్మెల్యే కందాలఉపేందర్‌రెడ్డిని వ్యక్తిగతంగా దూషిస్తూ సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసిన అల్లిక వెంకట్రావుపై గురువారం కేసు నమోదైంది. గూడురుపాడుకు చెందిన వెంకట్రావ్ ఎమ్మెల్యే విషయంలో అవమానకరంగా మాట్లాడడమే కాక ఎమ్మెల్యే ఫొటో ఉన్న క్యాలెండర్ చించేశాడు. ఈమేరకు ఉదయ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకట్రావు తెలిపారు.

ఫ్లెక్సీ షాప్ తగుల పెట్టిన దుండగులు

పెనుబల్లి : మండలంలోని వీఎం బంజర్ పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న ఆనంద్ ఫ్లెక్సీ వర్క్ షాపులో గురువారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. ఈ ఘటనలో రూ.15వేల విలువైన సామగ్రి దగ్ధమైందని యజమాని సాలి ఆనంద్‌కుమార్ తెలిపారు.

పోలీసుస్టేషన్‌కు వెళ్తే చంపేస్తాం..

నేలకొండపల్లి: తమపై పోలీసులకు ఫిర్యాదు చేస్తే చంపేస్తామని బెదిరిస్తున్నారని దివ్యాంగుడు వాపోయాడు. ఈమేరకు ఆయన గురువారం పోలీసులకు చేసిన ఫిర్యాదులోని వివరాలిలా ఉన్నాయి. మండలంలోని రాయగూడెంకు చెందిన డేగల కోటేశ్వరరావును అదే గ్రామానికి చెందిన తిరుపతిరావు, బ్రహ్మయ్య దివ్యాంగుడని హేళన చేస్తూ దూషిస్తున్నారు. అలాగే, ఆయనతో పాటు తల్లిపై కూడా దాడి చేశాడని, పోలీసులకు ఫిర్యాదు చేస్తే చంపేస్తామని బెదిరిస్తున్నారని వాపోయాడు. పోలీసులకు చేసిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు.

మోటారు సైకిళ్ల దొంగకు ఏడు నెలల జైలుశిక్ష

ఖమ్మంలీగల్: మోటారు సైకిళ్లు దొంగిలించి పట్టుబడిన సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలం కట్టకమ్ముగూడెంకు చెందిన వేమూరి కృష్ణకు ఏడు నెలల జైలుశిక్ష ఖరారైంది. ఈమేరకు ఖమ్మం ఒకటో అదనపు ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ఎస్.శాంతిసోని గురువారం వెల్లడించిన తీర్పు వివరాలిలా ఉన్నాయి. ఖమ్మంకు చెందిన గుంజమడుగు శ్రీనివాస్ తన మోటార్ సైకిల్ చోరీ గత ఏడాది మే 30న ఖమ్మం టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో దర్యాప్తు చేసిన పోలీసులు కృష్ణను నిందితుడిగా గుర్తించి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. కేసును విచారించిన న్యాయమూర్తి సాక్ష్యాధారాలను పరిశీలించాక నిందితుడికి శిక్ష విధిస్తూ తీర్పుచెప్పారు. ఇదే నిందితుడికి ఖమ్మం టూటౌన్, వన్ టౌన్ పోలీసులు నమోదు చేసిన మరో ఎనిమిది కేసుల్లో ఏడు నెలల జైలుశిక్ష విధించారు. ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీఓ అనిల్‌కుమార్ వాదించగా సిబ్బంది ముత్తయ్య, నరసింహారావు సహకరించారు.

విద్యుత్ ఏడీ ఇంట్లో చోరీ

ఖమ్మంఅర్బన్: నగరంలోని 3వ డివిజన్ జయనగర్‌కాలనీలో నివాసముండే ఖానాపురం విద్యుత్‌శాఖలో ఏడీ గుగులోత్ ఈర్యా ఇంట్లో చోరీ జరిగింది. ఈనెల 15న ఏడీ సంక్రాంతి సందర్భంగా ఇంటికి తాళం వేసి కుటుంబసభ్యులతో సొంతూరికి వెళ్లారు. గురువారం వచ్చే సరికి తాళం పగులగొట్టి బీరువాలో ఉన్న రూ.45 వేల విలువైన బంగారం, వెండి ఆభరణాలు చోరీ చేసినట్లు గుర్తించారు. ఈమేరకు ఈర్యా చేసిన ఫిర్యాదుతో ఖమ్మం అర్బన్ పోలీసులు కేసు నమోదు చేశారు.